క్లుప్తంగా

అగ్గిపుల్లపై వినాయకుడు



ఏలూరు (టూటౌన్): వినాయక చవితి సందర్భంగా అగ్గిపుల్లపై అతి సూక్ష్మమైన గణనాథుని ప్రతిమను రూపొందించి అబ్బుర పరిచారు సూక్ష్మ కళాకారుడు మేతర సురేష్ బాబు. నాలుగు మిల్లీ మీటర్ల ఎత్తు, రెండున్నర మిల్లీమీటర్ల వెడల్పుతో వినాయకుని ప్రతిమను తయారు చేశారు. తన సూక్ష్మ కళతో గణనాథునికి స్వాగతం పలుకుతున్నట్టు సురేష్‌బాబు తెలిపారు.

మట్టి ప్రతిమలను పూజిద్దాం



గణపతి ప్రతిమలు పంపిణీ చేస్తున్న నారా శేషు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పర్యావరణ పరిరక్షణ కోసం వినాయక చవితి రోజు మట్టి విగ్రహాలతో పూజలు చేద్దామని జనసేన నాయకులు, ఎన్ ఫౌండేషన్ అధినేత నారా శేషు పిలుపు నిచ్చారు. ఎన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలో 10 వేల వినాయక మట్టి ప్రతిమలను ధర్మభేరి ప్రాంగణంలో శుక్రవారం ప్రజలకు, భక్తులకు పంపిణీ చేశారు. జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు ఇల్లా శ్రీనివాస్, జనసేన నగర ప్రధాన కార్యదర్శి వాణి చౌదరి, జనసైనికులు, వీర మహిళలు, ఎన్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎకో ఫ్రెండ్లీ గణేశ్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డీవైఎఫ్ఐ, హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎకో ఫ్రెండ్లీ గణేశ్ అనే కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల ఆకృతుల్లో గణేశ్ ప్రతిమలను తయారు చేసి ప్రదర్శించారు. ఉప ప్రధానోపాధ్యాయుడు ఎన్ ఫణీంద్ర, డీవైఎఫ్ఐ ఏలూరు నగర నాయకుడు పాశల దుర్గాప్రసాద్, చిల్డ్రన్స్ క్లబ్ సభ్యురాలు యు.దుర్గ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణపతి ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో గణపతి నవరాత్రి మహోత్సవాల్లో నిబంధనలు పాటించాలని ఏలూరు టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ వైవీ రమణ సూచించారు. వినాయక చవితి ఉత్సవ కమిటీలతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఉత్సవాలను మత సామరస్యాన్ని పాటిస్తూ, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా మండపాల్లో నిర్వహించుకోవాలని సూచించారు. లౌడ్ స్పీకర్లు ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకే వినియోగించాలన్నారు. విగ్రహాల నిమజ్జనం సమయంలో డీజే లేదా అశ్లీల నృత్యాలకు అనుమతి లేదని తెలిపారు. పెద్ద విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రదేశాల్లో తాత్కాలిక సీసీ టీవీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్సై సాధిక్, మహిళా ఎస్సై నాగకల్యాణి, ఏలూరు 2 టౌన్ పరిధిలోని గణపతి నవరాత్రి ఉత్సవ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

జేపీకి అభినందన



శాలువ కప్పి జేపీని అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలూరు రూరల్ : వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా సమన్వయకర్తగా నియమితులైన జయప్రకాష్‌ను శుక్రవారం ఆ పార్టీ నాయకులు కలిశారు. ఏలూరు దక్షిణపువీధిలో గంగానమ్మ వార్ని జేపీ దర్శించుకున్నారు. అనంతరం ఏఎంసీ మాజీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, దాసరి రమేష్, కార్పొరేటర్ తంగెళ్ల రాము, కోయ సత్తబాబు, గుడివాక మోహన్ తదితరులు జేసీని కలిసి శాలువ కప్పి అభినందించారు. పార్టీ బలోపేతానికి జేసీ కృషి చేస్తారని ఆకాంక్షించారు.

హాస్టళ్లలో సంక్షామం'

- కింద కూర్చునే భోజనం చేస్తున్న విద్యార్థులు
- హాస్టళ్ల చుట్టూ నిలిచిన మురుగుతో దుర్గంధం
- ముంపులో అమీనాపేట బాలికల వసతి గృహానికి వెళ్లే రహదారి



అమీనాపేట బాలికల హాస్టల్‌కు వెళ్లే దారిలో మురుగు నీటితో ఇబ్బంది పడుతున్న విద్యార్థినులు



వర్షానికి రోడ్డుపైకి వచ్చిన నీరు (ఫైల్)



నేలమీద కూర్చునే భోజనం చేస్తున్న కాలేజీ విద్యార్థులు

ఏలూరు (టూటౌన్): సంక్షేమ హాస్టల్స్ కాస్త క్షామ హాస్టల్స్‌గా మారాయి. పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉండే వసతి గృహాలు పాలకుల నిర్లక్ష్యం వల్ల అభివృద్ధికి నోచుకోకపోగా, అక్కడి విద్యార్థులకు సమస్యలను తెచ్చిపెడుతున్నాయి. సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు చూస్తున్నారే తప్ప పట్టించుకున్న పాపాన పోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్ల అన్నింటిలోనూ పలు సమస్యలు తిష్ట వేశాయి. వీటిలో ప్రధానమైన స్థానిక అమీనాపేటలోని వసతి గృహాల సముదాయంలో వెయ్యి మంది వరకు విద్యార్థినులు వసతి పొందుతున్నారు. వర్షాకాలంలో ఈ హాస్టల్ చుట్టూ మురుగునీరు చేరి దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో దోమలు పెరిగిపోయి విద్యార్థినులు వైరల్, టైఫాయిడ్, మలేరియా వంటి జ్వరాల బారిన పడుతున్నారు. డ్రెయినేజీల్లో ఎప్పటికప్పుడు పూడిక తీసే వారు కరువవ్వడంతో సమస్య ఉత్పన్నమవుతుందని విద్యార్థినులు చెబుతున్నారు.

నగరంలో హాస్టళ్లు ఇవే..

ఏలూరు నగరంలో ఎస్సీ కాలేజీ బాలుర హాస్టళ్లు 2, బాలికలవి 2 ఉన్నాయి. 10వ తరగతి వరకు బాలురు 2, బాలికలు 2 ఉన్నాయి. బీసీ కాలేజీ బాలుర హాస్టళ్లు 3, బాలికలు 3, పదో తరగతి వరకు హాస్టళ్లు బాలురు 2, బాలికలు 2 ఉన్నాయి.



హాస్టల్ ప్రహారీ చుట్టూ నిల్వ ఉన్న మురుగు నీరు

వీటితో పాటు ఎస్టీ కాలేజీ హాస్టల్ ఒకటి ఉంది. వీటిలో రెండు వేలకు మందికి పైగా విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఎస్సీ హాస్టళ్లకు సొంత భవనాలు ఉన్నాయి. బీసీ కాలేజ్ హాస్టళ్లు ఒకటి రెండు మినహా మిగిలినవి అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్ వద్ద ఎస్టీ కాలేజీ హాస్టల్ ఉంది.

పారిశుద్ధ్యం అధ్వానం

హాస్టళ్లలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. తాగు నీటి కోసం పదేళ్ల క్రితం ఇచ్చిన వాటర్ ప్యూరీఫైర్స్ పాడైపోయాయి. ఒకటి రెండు చోట్ల సిబ్బంది బాగు చేయించుకుని వినియోగించుకుంటున్నారు. వంటకు వినియోగించే స్టవ్‌లు చాలాకాలం క్రితంవి కావడంతో కొంత ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. క్రింద కూర్చుని భోజనాలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నామని, బల్లలు ఇస్తే బాగుంటుందని కాలేజీ హాస్టల్స్ విద్యార్థులు కోరుతున్నారు.

అందని కాస్మోటిక్ చార్జీలు

విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు నెలనెలా అందడం లేదు. దసరా, సంక్రాంతి, వేసవి సెలవులకు ఇళ్లకు వెళ్లి తిరిగి వచ్చేందుకు వీలుగా ఆర్టీసీ బస్ పాసులు ఇవ్వాలని విద్యార్థులు కోరుతున్నారు.

మెనూ చార్జీలు అమలు ఇలా...

హాస్టళ్లలో మూడు నుంచి ఆరో తరగతి విద్యార్థులకు రోజుకి రూ.40, ఆరు నుంచి పదో తరగతి వరకు రూ.46, కాలేజీ హాస్టల్ విద్యార్థులకు రూ.53 చొప్పున అందిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రోజుకి రూ.5 పెంచడంతో మెనూ చార్జీలు ఈ మాత్రమైనా ఉన్నాయి. నాణ్యమైన భోజనం అందించాలని, రవాణా ఖర్చులు, వర్కర్ల జీతాలు తీసి వేసి రోజుకి రూ.72 చెల్లించాలని కోరుతున్నారు.

నెలవారీ అందని బిల్లులు

హాస్టల్ విద్యార్థులకు భోజనం వంటి సౌకర్యాల కోసం ఖర్చుపెట్టే సొమ్ములో వార్డెన్లకు నెలనెలా బిల్లులు రాకపోవడంతో వారు తమ సొంత పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంట్లో బంగారం తాకట్టుపెట్టి, పచారీ కొట్లలో అప్పుతెచ్చి నెట్టు కొస్తున్నారు. ఏవైనా రిపేర్లకు ఖర్చు పెట్టిన బిల్లులు ఆరు నెలల నుంచి ఏడాది పాటు వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది.

నాణ్యమైన సరుకులు అందించాలి

ప్రభుత్వం మెస్ చార్జీలు కేవలం 50 పైసలు పెంచి రూ.10 ఖర్చు పెట్టమంటుందని హాస్టల్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో ధరలు ఆకాశం వైపు చూస్తుండడంతో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించలేకపోతున్నామని చెబుతున్నారు. ప్రభుత్వం సబ్సిడీకి నాణ్యమైన సరుకులు అందించాలని కోరుతున్నారు. సరైన వంట పాత్రలు లేక, పర్మినెంట్ సిబ్బంది లేక హాస్టల్స్ నిర్వహణ భారంగా మారిందని వాపోతున్నారు.

పెరిగిన డ్రాపౌట్లు

హాస్టల్స్‌లో కనీస సౌకర్యాలు కరువవ్వడంతో డ్రాపౌట్ల సంఖ్య పెరిగింది. హాస్టల్స్‌లో ఉండలేక మధ్యలోనే విద్యార్థులు తమ సర్టిఫికెట్లను తీసుకుని వెళ్లిపోతున్నారు. మరికొన్ని హాస్టల్స్‌లో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గుతుంది. హాస్టళ్లలో సరైన ఫ్యాన్లు, బాత్రూంలు, నాణ్యమైన భోజనం లేకపోవడం, దోమలతోనే నిద్రించడం, భవనం శ్లాబు నుంచి పెచ్చులు ఎప్పుడు ఊడిపడిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. వర్షాకాలం హాస్టల్స్‌లో సీలింగ్ నుంచి వర్షం లీకవడంతో విద్యార్థులకు చుక్కలు కనిపిస్తున్నాయి.

గణపతి ఉత్సవాలకు సర్వం సిద్ధం

- ప్రతి వీధిలోనూ మండపాలు
- భారీ ప్రతిమల ఏర్పాటు
- చుక్కలనంటిన పూజా సామగ్రి ధరలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న మట్టి వినాయక ప్రతిమ



పత్రి కొనుగోలు చేస్తున్న భక్తులు



ఏలూరు వన్‌టౌన్ మార్కెట్‌లో..



మార్కెట్‌లో చవితి సందడి



వినాయకచవితికి విగ్రహాన్ని తీసుకువెళ్తున్న చిన్నారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏలూరు నగరం ముస్తాబైంది. ఏటాలానే ఈ ఏడాదీ భారీగా ఏర్పాట్లు చేశారు. ఒన్‌టౌన్‌లోని కుండీ సెంటర్, ఎస్ఎస్ మార్కెట్, పేరయ్య కోనేరు ప్రాంగణాల్లో భారీ గణపతి ప్రతిమలను సిద్ధం చేశారు. ఈ ప్రాంతాల్లో 9 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి, నిత్యం ప్రసాద వితరణ చేస్తారు. నగరంలోని దాదాపు అన్ని పేటలు, వీధుల్లో పోటాపోటీగా పందిళ్లు ఏర్పాటు చేశారు. నగరంలో రాజస్థాన్‌కు చెందిన అనేక మంది కళాకారులు రూపొందించిన ప్రతిమలతో పాటు, వివిధ ప్రాంతాల్లో తయారు చేసిన ప్రతిమలను దళారులు ఇక్కడకు తీసుకువచ్చి విక్రయించారు.

ప్రతి రోజూ ప్రత్యేక పూజలు

నవరాత్రి మహోత్సవాల్లో గణపతికి ప్రతి రోజూ ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఒక రోజు పుష్పాలు, మరో రోజు పత్రి, ఇంకో రోజు కుంకుమ పూజలు, గణపతి హోమాలు, సిద్ధి బుద్ధి సమేత గణపతి కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి శాకంబర అలంకరణ, కరెన్సీ వంటి ప్రత్యేక అలంకరణలు చేయనున్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈ నెల 16న భారీ ఊరేగింపుతో గణపతి నిమజ్జన మహోత్సవాలు నిర్వహించనున్నారు.

ధరాఘాతం

ఇంటిలో గణపతి పూజ చేసుకునే వారికి ఈ ఏడాది పూజా సామగ్రి ధరలు చుక్కలు చూపించాయి. 14 రకాల పత్రి రూ.50కు విక్రయించారు. సాధారణ మట్టి ప్రతిమ రూ.30, పాలవెల్లి రూ.50, ఛత్రం సైజును బట్టి రూ.20 నుంచి రూ.50 వరకు విక్రయించారు. పాలవెల్లికి అలంకరించే మొక్కజొన్న పొత్తులు, ఎలక్కాయ, మారేడు కాయ, నారింజ, బత్తాయి, యాపిల్ తదితర పండ్ల ధరలు సైతం సాధారణ ధర కంటే ఒక రెట్టు అధికంగా విక్రయించారు. అయినప్పటికీ ప్రజలు వాటిని కొనుగోలు చేసుకుని వెళ్లారు.

జోరువానతో ఇబ్బందులు

శుక్రవారం మధ్యాహ్నం నుంచి నగరంలో ఎడతెరిపి లేకుండా వాన కురుస్తుండడంతో గణపతి ప్రతిమలు, పత్రి, పాలవెల్లి, ఛత్రాలు, పండ్లు, పూలు కొనేందుకు వచ్చిన ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మధ్యాహ్నం ప్రారంభమైన వాన రాత్రి వరకూ తగ్గలేదు. వాన తగ్గుతుందని చూసి చూసి తగ్గకపోవడంతో రాత్రి సమయంలో ప్రజలు మార్కెట్‌కు బయలుదేరారు. దీంతో నగరంలోని ప్రధాన కూడళ్లలో జన సందడి కనిపించింది. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడ్డారు.

పని సర్దుబాటులను సవరించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లాలో డివిజన్ స్థాయి పని సర్దుబాటులో అనేకమంది ఉపాధ్యాయులను మూడు నాలుగు మండలాలు దాటి 50 కిలో మీటర్ల నుంచి 150 కిలోమీటర్ల వరకు సర్దుబాటు చేశారని వాటిని వెంటనే సవరించి మండలాల పరిధిలోనే పనిసర్దుబాటు చేయాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అవధానికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వర్క్ అడ్జస్ట్మెంట్ అంటే అదే మండలం లేదా పక్క మండలంలో వేయాల్సి ఉండగా, ఏలూరు డివిజన్లో 12 మండలాలు, జంగారెడ్డిగూడెం డివిజన్లో ఏడు మండలాలు, నూజివీడు డివిజన్లో ఆరు మండలాల పరిధిలో ఈ పని సర్దుబాటు జరగటం వల్ల టీచర్లు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఏలూరు కార్పొరేషన్‌లోని కొందరు ఉపాధ్యాయులు దూరప్రాంతంలోని మండలాలకు సర్దుబాటు చేయబడ్డారని వివరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫా అలీ, రవికుమార్ రుద్రాక్షి ఉన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు ఆర్ఎస్

ఏలూరు (టూటౌన్): రుద్రరాజు సత్యనారాయణ (ఆర్ఎస్) ప్రజా ఉద్యమకారుడు, ఆదర్శ కమ్యూనిస్టు అని ఎంసీపీఐ (యు) ఏపీ రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఆర్ఎస్ ప్రజా ఉద్యమాల కోసం తన యావత్తు జీవితాన్ని శ్రమజీవులకు అంకితం చేశారని ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి కాటం నాగభూషణం పేర్కొన్నారు. పార్టీలో ఆయన శిష్యునిగా, సహచరునిగా పనిచేసినందుకు గర్వపడతున్నట్టు తెలిపారు. ఆర్ఎస్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని వివరించారు.

కొల్లేరు గ్రామాలకు పెరుగుతున్న ముంపు



మాదవాపురం వద్ద కొల్లేరు రోడ్డుపై పయనిస్తున్న ప్రజలు

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండలంలో కొల్లేరు గ్రామాలకు వరద ముంపు పెరుగుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయానికి గుడివాకలంక వద్ద ప్రధానరోడ్డుపై నుంచి రెండు అడుగల ఎత్తులో వరదనీరు ప్రవహిస్తోంది. గురువారం రోడ్డుపై ఇకటి రెండు చోట్ల మాత్రమే నీరు ప్రవహించగా, శుక్రవారం రోడ్డు మొత్తం వరదనీటిలో మునిగిపోయింది. కై కులూరు ప్రధాన రోడ్డు నుంచి కలకుర్రు వెళ్లే రోడ్డు సైతం మునిగింది. మొత్తంగా 9 గ్రామాలను వరద పూర్తిస్థాయిలో చుట్టుముట్టి రాకపోకలను స్తంభింపజేసింది. పలు భారీ వాహనాలు, ద్విచక్ర వాహనాలు ప్రమాదకర స్థితిలో పయనిస్తున్నాయి. బుడమేరు, తమ్మిలేరు నుంచి వస్తున్న వరదతో పాటు భారీ వర్షం పడడంతో కొల్లేరులో నీటి మట్టం అంతకంతకు పెరుగుతోంది. దాదాపుగా అన్ని ప్రధాన రోడ్లకు 5 నుంచి 6 అడుగల ఎత్తులో మాత్రమే గ్రామాలు ఉన్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వరుణుడు కరుణించాలని, ముంపు బారి నుంచి రక్షించాలని మహిళలు గంగమ్మకు పూజలు చేస్తున్నారు.

సాయినగర్ కాలనీలో తాగునీటి కష్టాలు



ఏలూరు (టూటౌన్): స్థానిక 14వ డివిజన్ సాయినగర్ కాలనీలో గత 15 రోజులుగా తాగునీటి కష్టాలను ఎదుర్కొంటున్నామని నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బందికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై నగర పాలక సంస్థ వాటర్ సప్లయ్ ఏఈని సంప్రదించినా స్పందించలేదని వాపోయారు. సొంతంగా పైపులైను వద్ద మట్టి తవ్వి మరమ్మతులు చేద్దామంటే సమస్యను గుర్తించడంలో తమకు ఇబ్బందులు తలెత్తాయని తెలిపారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలంటూ స్థానికులు కోరుతున్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళం




కలెక్టర్‌కు చెక్కును అందిస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): ఏలూరు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.2,09,316 విరాళం అందించింది. శుక్రవారం ఏలూరు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి కలిసి సంబంధిత చెక్కును అందజేశారు. కలెక్టర్ సీనియర్ సిటిజన్స్‌ను అభినందించారు. అసోషియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీఎస్ఎస్ ప్రసాద్, ఉపాధ్యక్షులు వి.నారాయణరావు, సెక్రటరీ డి.భాస్కరరావు తదితరులు ఉన్నారు.

బాధితులకు సహాయం

ఏలూరు (టూటౌన్): సెయింట్ జాన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రెండో రోజు శుక్రవారం మంగళగిరి వద్ద గల ఆత్మకూరులో వరద బాధితులు 200 మందికి పాలు, బిస్కెట్లు పంపిణీ చేసినట్లు సొసైటీ అధ్యక్షుడు పెరికె వరప్రసాదరావు తెలిపారు. కార్యక్రమంలో మల్లవరపు సుధారాణి, ఈపూరి ఆదం, బేతపూడి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు. విజయవాడ వరద బాధితులకు ఎంఆర్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, అక్షర సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు పొలిమేర హరికృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం పులిహోర పొట్లాలు పంపిణీ చేశారు. రాష్ట్ర దళిత జేఏసీ నాయకులు నిడమర్తి నాగేశ్వరరావు, నారపాము కిషోర్, ఎర్ర సత్యానందంలతో కలిసి వరద ప్రాంతాల్లో పర్యటించినట్టు హరికృష్ణ తెలిపారు.

పోషకాహారంతోనే ఎనీమియా నివారణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

ఏలూరు (టూటౌన్): పౌష్టికాహారాన్ని అందించడం ద్వారా పిల్లల్లో ఎనీమియాను నివారించవచ్చునని ఐసీడీఎస్ ఏలూరు ప్రాజెక్టు అధికారిణి పద్మావతి తెలిపారు. ఏలూరు ఫస్ట్ సెక్టార్ ద్వారకా నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ పద్మావతి మాట్లాడుతూ పౌష్టికాహారాన్ని పిల్లలకు అందించే విధానాన్ని వివరించారు. అనంతరం ఐదేళ్లలోపు పిల్లల పోషణ స్థాయిని గుర్తించి నమోదు చేశారు. గర్భిణులు, బాలింతలకు ఎఫ్‌ఆర్ఎస్ ద్వారా పోషకాహార పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తంగిరాల అరుణ, సూపర్‌వైజర్లు బి.మంగ, ఏఎన్ఎం డి.నాగకుమారి, ఆశాకార్యకర్త రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్త ఎస్ వాణిశ్రీ పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	24
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	07
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	05
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	10
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	09
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	13
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	15
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	16
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	06
ఏలూరు - తిరుపతి	16.00	4830	27